క్లుప్తంగా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



తెనాలిటౌన్: బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద 'అన్నదాత సుఖీభవ' తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని పట్టణ వన్ టౌన్ సీఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. వేసవి చివరి వరకు చలివేంద్రంలో మజ్జిగ, మినరల్ వాటర్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చలివేంద్రం నిర్వాహకు సహకరిస్తున్న వారికి ఓటీటీ వెంకట ప్రతాప్ ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చ



తెనాలిఅర్బన్: మానవతా మూర్తి ఎన్టీఆర్ అని వసంత బసవేశ్వరరావు, చందు సాంబశివుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై ఆదివారం సాయంత్రం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా జీవితంలో ఎన్టీఆర్ పారదర్శకత అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ప్రముఖ పారాశిక, రంగస్థల నటులు తోట బసవయ్యతో పాటు వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో శత జయంత్యుత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ ఆయూరి మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, మువ్వనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, దేవరపల్లి భవాని, గుమ్మడి ప్రసాద్, చింతలపూడి శ్రీనివాసరావు, పావులూరి శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, వెనిగళ్ల శివప్రసాద్, ఆదాయ్యల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేత



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం 18వ వార్డుకు చెందిన భరిరెట్టి ధనలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్‌లో పది రోజుల నుంచి చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ రేష్మా అక్కడకు వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్‌ను ఆదివారం అందజేశారు.

రైలులో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన ప్రయాణికులు అధికారులకు సమాచారమందించారు. రేపల్లె నుంచి కాచిగూడ వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి ఎస్1, ఎస్2 బోగీల మధ్య లింక్ వద్ద ఉండే రేకుపై మృతదేహం ఉండటాన్ని ప్రయాణికులు గుర్తించారు. రైలు తెనాలికి చేరుకోగానే అధికారులు మృతదేహాన్ని రైలు నుంచి దింపి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటొచ్చు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి రాక



మంగళగిరి: యర్రబాలెం శ్రీనగర్ కాలనీ లక్ష్మీ సూర్యా ఎస్టేట్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి సోమవారం విచ్చేయనున్నట్లు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో వారు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీ విచ్చేయనుండటం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. భక్తులనుద్దేశించి శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేయనున్నారని, లోక కల్యాణార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యం, జి.కామేశ్వరశర్మ, నటరాజ శర్మ, వి.హరినారాయణ, రాదాకృష్ణ, నరసింహారావు, బాష్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'

- గడప గడపకూ కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు
- ప్రభుత్వ పథకాలపై అవగాహన
- ప్రజల నుంచి విశేష స్పందన



మల్లెపాడులో కరపత్రాలు అందజేస్తున్న మండల కన్వీనర్ ఫరీద్, నిరంజన్, తదితరులు



11వ వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు హరీష్, గృహసారథులు



ఆరో వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు హేమలత, సచివాలయ కన్వీనర్లు



గుడివాడలో కరపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



18వ వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ గౌస్య, సచివాలయ కన్వీనర్లు



5వ వార్డులో స్టిక్కర్లు అంటిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తోట రఘురామ్, కో-ఆప్షన్ సభ్యుడు సుభానీ

తెనాలిఅర్బన్/తెనాలి టౌన్: జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించారు. కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. ప్రజల సమస్యలతోపాటు ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నారు. కార్యక్రమ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కొందరు ఆదనపు స్టిక్కర్లను అడిగి మరీ తీసుకుని తమ వాహనాలకూ అంటించుకుంటున్నారు. ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిని, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2024లో కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వస్తోందని నాయకులకు స్పష్టం చేస్తున్నారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కలారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు కలారి హరీష్, 18వ వార్డు కౌన్సిలర్ షేక్ గౌస్య, 5వ వార్డు కౌన్సిలర్ తోట రఘురామ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పెద్దింగ్ సుభానీ, ఆరో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకురాలు పోతిరెడ్డి హేమలత తదితరులు పాల్గొన్నారు.

■ తెనాలి మండలం గుడివాడలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ స్టిక్కర్లను గృహాలకు అంటించారు. కార్యక్రమంలో గృహసారథులు దేశబోయిన హైమావతి, రంగారావు, గోపి, కడియాల శివరామబ్రహ్మం, బురదగుంట రమేష్, బంటికిళ్ల జయరావ్, మత్తే దనకిషోర్, దేశబోయిన వెంకటేశ్వర్లు, బోడియ్యలు పాల్గొన్నారు.

■ మల్లెపాడులో వైఎస్సార్ సీపీ మండల కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఫరీద్, గ్రామ కన్వీనర్ పిన పాటి నిరంజన్ ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. గృహాలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో గృహసారథులు పిన పాటి శేఖర్‌బాబు, స్టీవెన్‌బాబు, ఉన్నం ప్రవీణ్, బెన హర్‌బాబు, వలంటీర్లు జగదీష్, రవికిరణ్, కిరణ్, వైస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

■ అంగలకుదురు గ్రామంలో కన్వీనర్లు, గృహసారథులు గడప గడపకు వెళ్లారు. కరపత్రాలు, స్టిక్కర్లు అందజేశారు. కొలకలూరులోని దళితవాడలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ మల్లవరపు బుజ్జయ్య, కోడూరు లూకా(రమేష్), గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మతాల ఐక్యతకు ప్రతిరూపం 'రెండు ఆకాశాల మధ్య'

పరిచయ సభలో ఆచార్య కృపాచారి



పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ కృపాచారి, వక్తల నాగేశ్వరరావు, సయ్యద్ సలీం, హనుమంతరావు, హకీంజాని

తెనాలి: హిందూ ముస్లింల ఐక్యతకు 'రెండు ఆకాశాల మధ్య' నవల ప్రతిరూపమని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత సయ్యద్ సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య' పుస్తక పరిచయ సభ ఆదివారం స్థానిక కొత్తపేటలోని అతిథి గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్సు హాలులో నిర్వహించారు. శారద సాహితీ సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన సభకు డాక్టర్ కృపాచారి అధ్యక్షత వహించారు. తొలుత పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రెండు విభిన్న దేశాల మధ్య భిన్న సంస్కృతులు, ఆచారాలు దాటుతూ మానవతను, మనుష్యుల మధ్య ప్రేమను, సమాజ ఐక్యతను సలీం తన తాజా నవలలో చాటారని ఆయన అభినందించారు. మొత్తంమీద మానవత్వపు విలువల్ని చాటుతూ ప్రేమకు ప్రతిరూపంగా నిలిచిందన్న భావనకు పాఠకులు లోనవుతారని ప్రశంసించారు. రచయిత సయ్యద్ సలీం తన ప్రసంగంలో దేశవిభజన జరిగిన సందర్భంగా సరిహద్దులోని ఇరు దేశాలకు చెందిన రెండు గ్రామాలను కథాంశంగా తీసుకుని నవల రాసినట్టు తెలిపారు. మతకమ్మా మానవత్వం గొప్పది అనేది నవల సందేశంగా వివరించారు. యర్రంశెట్టి హనుమంతరావు స్వాగతం పలికిన సభలో ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని రచయితను పరిచయం చేశారు. రచయిత నూతలపాటి నాగేశ్వరరావు నవలా పరిచయం చేశారు. ఎల్.వెంకటేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, గోనుగుంట్ల మురళీకృష్ణ, విష్ణుమొలకల బీమేశ్వరప్రసాద్, పాత్తూరి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగులో ఉచిత గుండె వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పవన్‌కుమార్

తెనాలిటౌన్: నందివెలుగులో మేముసైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్ విజయవాడ సౌజన్యంతో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్ ప్రారంభించారు. వైద్యశాలకు చెందిన కార్డియాలజిస్టు డాక్టర్ సాయిరెడ్డి బృందం వైద్యులు సుమారు 246 మందికి గుండె పరీక్షలు చేశారు. ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి యాంజియోగ్రామ్, టీఎంటీ పరీక్షలు చేశారు. తీవ్రమైన సమస్యలుంటే శస్త్రచికిత్సలూ ఉచితంగా చేస్తామని డాక్టర్ సాయిరెడ్డి తెలిపారు. సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మేముసైతం సభ్యులు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో మేముసైతం అధ్యక్షుడు కల్యాణం సాంబశివరావు, ఉప ాధ్యక్షులు ఎర్రమోతు జగన్మోహనరావు, ప్రధాన కార్యదర్శి షేక్ షకూర్‌బాషా, నరసింహారావు, వెంకటరత్నం, హనుమంతరావు, కల్యాణ్‌కుమార్, సత్యనారాయణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు రాజేశ్వరరావు



రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నాయకులు

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన చండ్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సీపీఐ జాతీయ నాయకుడు చండ్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ రాజేశ్వరరావు సేవలను కొనియాడారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రజా నాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలోని పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు గని, సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, పట్టణ కార్యదర్శి సాయి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి షల్కాటి నాగరాజు, పట్టణ కార్యదర్శి బీళ్ల రాజేష్, నాయకులు రవితేజ, ఆకోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు

నిజాంపట్నం: వాసవీ క్లబ్ నిజాంపట్నం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం అభినందనీయమని ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ నిజాంపట్నం, రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం ఆధ్వర్యంలో శంకర్ కంటివైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హరనాథబాబు ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 295 మంది రోగులు పాల్గొన్నారు. 202 మంది శస్త్రచికిత్సకు అనుమతి పొందారు. నిర్వహణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.గౌరీశంకర్, వైస్ చైర్మన్ బాష్యం, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసరావు, సెక్రటరీ హనుమాన్, గోపీ, మహేంద్రకుమార్, నాజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కావలప్పూడూరు: మతుకుమల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ మద్దినేని రామకృష్ణ, సుబ్బాయమ్మ దంపతులు ఆదివారం తెలిపారు. ఆలయ పూజారి కొడవటికంటి మోహనరంగాచార్యులు, వేద పండితుడు చిట్టకడి గోపాలాచార్యులు సారథ్యంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తొలిరోజు స్వామికి వివిధ పూజా కార్యక్రమాలు, 14న శాంతి కల్యాణం మహోత్సవం, 15న పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్నసంతర్పణ, గ్రామోత్సవంతో వార్షికోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఆలయ అధ్యక్షులు బొల్లా శ్రీనివాసరావు, స్వరూపరాణి, ఉత్సవ నిర్వహణ, ఆలయ అభివృద్ధి భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

● ముంజేతుల్లో దివ్యౌషధం



వేసవి వచ్చిందంటే గుర్తొచ్చేది తాటిముంజలు. ఉష్ణతాపం నుంచి ఇవి ఉపశమనం కలగజేస్తాయి. ఎండాకాలం వీటిని తినేందుకు అందరూ ఇష్టపడతారు. అనేక పోషకాలు ఉంటాయి కాబట్టి దీనిని ఐస్ యాపిల్ అని కూడా పిలుస్తారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన్‌లో రహదారి వెంట తాటిముంజలను విక్రయిస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. –భట్టిప్రోలు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



టౌన్ చర్చిలో ఈస్టర్ సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్



యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో సంఘస్తులకు బహుమతులు అందజేస్తున్న బ్రదర్ ఆనందన్న

తెనాలిఅర్బన్/తెనాలి టౌన్/తెనాలి రూరల్: యేసుక్రీస్తు పునరుత్థానంలోని ఆంతర్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఈస్టర్ పండగ సందర్భంగా బోసురోడ్డులోని టౌన్ చర్చి, ఐతానగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యేసుక్రీస్తు విశిష్టతను కొనియాడారు. తెనాలిలో క్రైస్తవుల సమాధుల తోట అభివృద్ధికి నిధులు విడుదల చేయడంతోపాటు స్థలాన్ని కూడా కేటాయించే దస్త్రాలు తీసుకువెళ్లనున్నట్లు ప్రకటించారు. తెనాలి ప్రాంత క్రైస్తవుల తరఫున నిధులు కేటాయిస్తున్న సీఎం జగన్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. క్రైస్తవులు కూడా సీఎం జగన్‌కు కరతాళ ధ్వనుల ద్వారా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్‌పై చేతులు ఉంచి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టౌన్ చర్చి పాస్టర్లు దేవరపల్లి యేసురత్నం, యామర్తి బెనిన్‌బాబు, దగ్గుమల్లి సల్మాన్‌రాజు, మల్లె విజయభాస్కర ప్రకాష్‌బాబు, ఆడహాక్ కమిటీ సభ్యులు, గుంటూరుకు చెందిన పాస్టర్ రాంబాబు, ఐతానగర్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ డేవిడ్ జీవ భూషణ్ రాజు, చర్చి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మట్టపూడి సైమన్, తెనాలి ఆనంద్‌కుమార్, బ్రిజరర్ ఐమ్మళ్ల జ్యోతి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, దేవరపల్లి కిషోర్, అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

● మారీసుపేటలోని ఫిలడెల్ఫియా చర్చిలో పాస్టర్ చిలువూరి సతానియేలు ఈస్టర్ సందేశాన్ని అందించారు. అలాగే మారీసుపేటలోని న్యూజెరూసలేమ్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ సాపాటి విజయ్‌కుమార్ వాక్యపరిచర్య చేశారు. పట్టణంలోని పలు చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.


● తెనాలి మండలం నందివెలుగులోని ఇమ్మానుయేలు ప్రార్థనా గోపురంలో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, దింతా సురేష్, చంద్రయాదవ్, పలువురు దైవజనులు పాల్గొన్నారు.

● ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఈస్టర్ ఆరాధన నిర్వహించారు. సంఘ కాపరి బ్రదర్ ఆనందన్న సంఘస్తులకు బహుమతులు అందజేశారు.

● కొలకలూరులోని ఆర్సీఎం చర్చిలో శనివారం అర్ధరాత్రి దివ్యబలిపూజను ఫాదర్ సాగర్, థామస్ జరిపారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఫాదర్‌ను కాలువతో సిస్టర్స్, సంఘస్తులు సత్కరించారు. పలు ఆర్సీఎం చర్చిలు, తెలుగు బాప్టిస్ట్ చర్చిలు, లూథరన్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

● తెనాలి మోరిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో ప్రత్యేక ఆరాధనను నిర్వహించారు. పునరుత్థాన ప్రేమ, పునరుత్థాన బలము అన్న అంశంపై బిషప్ పినపాటి జాన్‌పాల్ దైవ సందేశం అందించారు. సంఘ పెద్దలు పినపాటి దేవిడ్ రాజు, ఊపూరు శ్రీనివాసరావు, కె. భాస్కరరావు, సంఘస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే దివ్యాంగుల సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామయ్య

బాపట్ల: వైఎస్సార్ సీపీతోనే దివ్యాంగుల సంక్షేమం సాధ్యమవుతోందని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య పేర్కొన్నారు. దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్లా రామయ్య మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులకు నిజమైన స్థలాలు మంజూరు చేయటంతోపాటు ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. పెన్షన్లు ప్రతి నెలా అందించటం వల్ల దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం చేసే సాయం చేయటం లేదని పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు గుంజ ఏడుకొండలు, అక్కల కృష్ణారెడ్డి, మద్దికి ఇండ్ల శ్రీనివాసరావు, పులి నారాయణరావు, దిమ్మటా మార్కు, వల్లాపల్లి గోపి, యార్లగడ్డ కొండమ్మ, సబ్బువరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గోగులమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో గోగులమ్మ

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి అర్చకులు దివి గోపాలకృష్ణమాచార్యులు శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

నూకాలమ్మ జాతర

చెరుకుపల్లి: ఆరుంబాక గ్రామంలోని గ్రామ దేవత నూకాలమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునే సుప్రభాత సేవతో అభిషేక మహోత్సవాలు నిర్వహించి పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి సారె, సద్దినైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వైభవంగా చెన్నకేశవుని కల్యాణం



రేపల్లె రూరల్: పేటేరు గ్రామంలోని భూసమేత చెన్నకేశవస్వామి తిరు కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి, దేవేర్లకు అర్చకులు మంగళస్నానాలు చేయించి పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో నెలకొల్పి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామిని ఆలయ ఈవో వెంకట అప్పలాచార్యులు, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ రవికిరణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ వేడుకలను తిలకించి పులకించారు.

నేడు శంకరన్ స్మారక సభ

బాపట్ల అర్బన్: దళితుల అభివృద్ధి కోసం నిర్విరామంగా, నిస్వార్థంగా సేవలందించిన నిరాడంబర అధికారి శంకరన్ అని ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు కొనియాడారు. రాష్ట్రంలో బెట్టి చాకిరీ నిర్మూలన అమలుకు శంకరన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కారంచేడు బాధితుల పునరావాసం, సఫాయి కర్మచారుల విముక్తి కోసం ఎంతో కృషి చేశారన్నారు. సోమవారం సాయంత్రం బాపట్ల టౌన్ హాలులో హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ శంకరన్ స్మారక సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సభకు ప్రముఖ పౌరహక్కుల నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్, మానవ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ చక్రపాణి పాల్గొంటారని వెల్లడించారు.

భారీ అన్నసంతర్పణ

బాపట్ల అర్బన్: బాపట్ల గ్రామ ఆదిస్థాన దేవత్ల దేవస్థానంలో ఆదివారం భారీ అన్నసంతర్పణ జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మ ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మన శ్యాంసుందర్ తెలిపారు. ఏటా కోదండరాముని తిరునాళ్లకు ముందు రోజు అన్నసంతర్పణ ఉంటుందని వివరించారు. భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చక్రస్నానం ఉత్సవానికి పోలేరమ్మ తల్లి దేవస్థానం సారెను సమర్పించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలను పేదలకు ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప్పాల నాగేశ్వరరావు, మానం ఆదినారాయణ, కల్లి శ్రీనివాస రావు, నరాలశెట్టి కృష్ణమూర్తి, బొమ్మిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

బాపట్లటౌన్: మండలంలోని నాగరాజు కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఆదివారం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ కథనం ప్రకారం నాగరాజు కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకువచ్చింది. మహిళ వయసుసుమారు 40 ఏళ్లు ఉంటుంది. ఎనిమిది వేల మందికిపైగా గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకు వచ్చింది. మహిళ వయసుసుమారు జాకెట్, బంగారు లంగా ధరించి ఉంది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.